# ఊరగాయ నవ్వింది!

ప్రముఖ సంస్థ ఒకటి ఊరగాయ పరిశ్రమని కూడా ప్రారంభించింది. ఏ సేవల్లో చూసినా ఆ పచ్చళ్ళని గురించి ప్రకటనలే. వివిధ భారతిలో ప్రకటనలే కాకుండా ప్రత్యేక కార్యక్రమాలు కూడాను. రోడ్లమీద పోతుంటే ముఖ్యమైన సెంటర్లలో ఈ పచ్చళ్ళను గురించిన పెద్ద పెద్ద హోర్డింగ్స్. నాకు సినిమాలు చూసే తీరికా, ఓపికా లేవుకాని, ఎడ్వర్టయిజ్‌మెంట్ షార్ట్స్ సినిమాలుగా కూడా ఖాయంగా వచ్చేఉంటాయని నా నమ్మకం.

ఏమైతేనేం ఆ ప్రకటన జోరుతో మనసులోనే నాసికాపుటాలకి కమ్మని ఊరగాయల వాసన తగిలి నోరూరిపోసాగింది. ఇంక ఊరిఊరి కారిపోయే స్థితి వచ్చేసరికి జిహ్వాచాపల్యం ఆపుకోలేక ఒక సీసా కొనేశాను. పావుకిలో సీసాకి పదిహేడు రూపాయలు పెట్టడమంటే ముందు మనసు కొంచెం పీకులాడినా అది అందించబోయే రుచులు తలుచుకుని ధైర్యం చేసి కొనేశాను. కుస్తీ పోటీల్లో ట్రోఫీని కొట్టేసినట్లు, అర్జునుడు మత్స్యయంత్రాన్ని సాధించినట్లు (పడిపోయిన ఆ చేపను చేతిలో పట్టుకు తిరిగాడో లేదో నాకు తెలియదు - అసలు ఆ చేప పడిపోయిందో లేదో - లేదా గుచ్చుకున్న బాణం దానికే ఉండిపోయిందో కూడా నాకు తెలీదు) నలుగురికి కనిపించేటట్లు ఆ సీసాను తీసుకుని హంసగమనంతో ఇంటికి బయలుదేరాను.

అలా నెమ్మదిగా నడుస్తుంటేనే నలుగురూ నన్ను చూసి వారిలో అంతటి సాహసం చేయలేని వారు అసూయతో నావంక చూస్తారని ఆశించాను. కాని - చెప్పొద్దూ నా విషయం పట్టించుకున్నవాడెవడూ లేకపోవడంతో నిరాశే కలిగింది. 'పోన్లే ..... ఇదీ మంచికే .... నన్ను చూసి అసూయపడితే వాళ్ళ మనసుకి బాధ కలుగుతుంది. అంటే పరోక్షంగా వాళ్ళని బాధించినవాడినవుతాను. ఆ పాపం నాకెందుకు? నాకు ఆ పాపం అంటకుండా ఉండడానికే భగవంతుడు ఇలా చేశాడు" అని నన్ను నేనే ఓదార్చుకుని నాకు నేనే సర్ది చెప్పుకున్నాను.

ఇంటికి జేరాక కనీసం ఇప్పుడైనా ఒక్కడైనా ఆఖరికి ఇరుగుపొరుగు వారైనా చూస్తారేమోనని, గేటు దగ్గరే, నలుగురికీ కనిపించేటట్లు సీసా పట్టుకుని కాసేపు తారట్లాడాను. ఊహూఁ...ఎవ్వరేనా పట్టించుకుంటేగా!

ఇంతలో లోపల్నుంచి చూసిన మా చిన్నవాడు "అరుగో నాన్నగారు వచ్చారు" అన్న గావుకేకతో ఇంక అక్కడ వుండే అవకాశం లేక గేటు తీసుకుని నెమ్మదిగా లోపలికి రాసాగాను. నా చేతిలో సీసా ఉండడం చూసి "నాన్నగారు ఏదో తెస్తున్నారు" అని మళ్ళీ ఓ అరుపు అరిచాడు వాడు. కొంచెం దూరాన్నించి చూసినవన్నీ అరుపుల్లో చెప్పడం వాడికి అలవాటు - అది హాబీయేమో కూడా. వాడిచ్చే అనౌన్స్‌మెంట్స్ చూస్తుంటే భవిష్యత్తులో వీడు ఏ రేడియోలోనో, టీ.వి.లోనో అనౌన్సర్‌గా అఘోరించడు

కదా అని అనిపిస్తుంది. అటువంటప్పుడు ఏ రైలుస్టేషన్‌లోనో, బస్‌స్టాండ్‌లోనో రాకపోకలు తెలిపే అనౌన్సర్ కాకూడదా అని మనసు పరిహసిస్తుంటుంది. ఛీ....పాడు ఆలోచనలు. అని నా మనసుని నేనే మందలించుకుంటాను.

ప్రతి చర్యకీ వాడిచ్చే కామెంట్రీ చూస్తుంటే బహుశా వీడు ఏ క్రికెట్ కామెంటేటర్‌గానో పేరు గడించి నాకూ కీర్తి తెస్తాడు అనిపిస్తుంటుంది. వాడికి క్రికెట్ అంటే మహాపిచ్చి ఉండడంతో ఇది నా అంతరాత్మ చెప్తున్న భవిష్యద్వాణి అనిపిస్తుంటుంది. ఇంట్లో అందరికీ ఆఖరికి వంటింట్లో వటం చేసుకునే మా ఆవిడా, మధ్యగదిలో కూర్చుని కృష్ణారామా అనుకునే మా అమ్మకి కూడా ఈ జాడ్యం అంటించేశాడు వాడు. పోపు వేస్తూనే మా ఆవిడ "ఇప్పుడు స్కోరు ఎంతరా?" అని అడుగుతుండడం, భాగవతం చదువుతూ కూడా మా అమ్మ "ఇప్పుడు బ్యాటింగ్ ఎవరిదిరా?" అని మధ్య మధ్య అరుస్తుండటం చూస్తే 'ఇది కలికాలం కాదు. క్రికెట్ కాలం' అనిపించేది నాకు.

మా ఇంట్లో క్రికెట్ అంటువ్యాధి సోకనివాడిని నేనొక్కడినే. అంటించాలని విశ్వప్రయత్నం చేశారు కాని నాకు అంటుకోలేదు. 'ఏద్దుకేమి తెలుసు అటుకుల రుచి' అన్న సామెతను జ్ఞాపకం చేసుకున్నారో ఏమో ఇంక నావెంటపడడం మానేశారు. క్రికెట్ వ్యాధి అంటకపోయినా మావాడి బ్యాటింగ్ పుణ్యమా అని రెండుమూడుసార్లు ఆ బాల్ దెబ్బలు రుచిచూశాను. దాంతో మావాడు క్రికెట్ కళానైపుణ్యాం ప్రదర్శించేటప్పుడు ఆ ఛాయలకి కూడా వెళ్ళడం మానుకున్నాను.

నేనైతే నోరుమూసుకుని ఊరుకున్నానే కానీ ఊళ్ళోవాళ్ళు ఊరుకుంటారా? ఒకటి రెండుసార్లు రోడ్‌మీద పోయేవాళ్ళ వీపుల్ని ఆ బాల్ నగారా మోత మోగించడం దాంతో వాళ్ళు గేటు తీసుకుని మా కాంపౌండ్‌లోకి పరిగెత్తుకుంటూ వచ్చి మావాడ్ని కొట్టేంత పనిచేయడం, సమయానికి నేనుండి వారిని "అయ్యా .... బాబూ.... ఏదో చిన్నతనం. పొరబాటయింది. (క్షమించండి. అనడానికి అభిమానం అడ్డువస్తుందాయె) ఇంక ఆడనీయనులెండి" అని బ్రతిమలాడి పంపించేసరికి తలప్రాణం తోకకి రావడంతో ఇంక నేను ఇంట్లో ఉండగా మా చిన్నవాడు పెద్దవాడు క్రికెట్ క్రీడను ఆపేశారు.

ఆ తర్వాత ఓసారి మా అమ్మగారు పండగనాడు దేవుడికి పూజ చేద్దామని దొడ్లో పూలు కోసుకుంటుంటే మావాడు కొట్టిన బంతి సూటిగా వెళ్ళి ఆమె తలకి తగలడంతో "చచ్చాన్రోయ్" అన్న పెద్ద అరుపు అరిచి క్రిందపడిపోయి కళ్ళు తేలేసింది ఆవిడ. ఆవిడ ముఖాన్న నీళ్ళు చల్లి సపర్యలు చేశాక కాని పోబోయిన ఆవిడ ప్రాణం తిరిగి రాలేదు. కాని మా ప్రాణాలు మాత్రం పోయినంత పనయింది. అది ఓమాదిరి గట్టిగా ఉండే కాన్వాస్ బంతి కనుక సరిపోయింది. ఆవిడ తలకి బొప్పి మాత్రమే కట్టింది. అదే అసలు సిసలు ఇనుపగుండు వంటి క్రికెట్ బాల్ అయితే తల పగిలి ప్రాణం పోయుండేదే.

ఆరోజు సెలవు కావడంతో నేనూ ఇంట్లోనే ఉన్నాను. ఎన్నాళ్ళనుంచో క్రికెట్ ఆడకపోవడంతో మా అబ్బాయిల మనసు పెరపెర లాడింది. ఆడితే నేనేమంటానో నని భయం. ఇంజక్షన్ ఇచ్చేటప్పుడు టెస్ట్ డోస్‌లాగా నా రియాక్షన్ చూడాలని బాటూ బంతీ పుచ్చుకుని దొడ్లో తిరిగారు. పోనీలే పండగనాడు కాసేపు ఆడుకుంటార్లే అని నేనూ చూసి చూడనట్లు ఊరుకున్నాను. నాలో రియాక్షన్ రాకపోవడంతో ధైర్యం తెచ్చుకుని వాళ్ళు ఇంక ఆట మొదలు పెట్టారు.

'ప్రథమ కబలే మస్తికా పాత:' అన్నట్లు మొదటి షాట్‌తోనే వాడు వాళ్ళ నాయనమ్మని 'ఔట్' చేయలేదుకాని అంతపనీ చేశాడు. ఆ దెబ్బతో వాళ్ళు మళ్ళీ క్రికెట్ జోలికి పోలేదు. మా అమ్మకి కూడా క్రికెట్ దెబ్బ నషాలానికి అంటిందేమో ఇంక స్కోర్ గురించి అడగడం మానేసింది. దానికితోడు

టీ.వి.లో కూడా చీటికి మాటికి క్రికెట్ మాచ్‌లు చూపడం ఆగిపోయింది. అంతటితో ఓ వెలుగు వెలిగి ఆరినట్లే క్రికెట్ ఘోష మా ఇంట్లో అంతరించింది.

"నాన్నగారి చేతిలో ఏదో పెద్ద సీసాయే ఉంది. ఫ్రూట్‌జామ్ తెచ్చినట్లున్నారు" అన్నాడు మా చిన్నవాడు మళ్ళీ.

"అదేం కాదోయ్. దాని ఆకారం చూస్తే బూస్ట్ సీసాలాగా ఉంది. మనకి పరీక్షలు దగ్గరికి వస్తున్నాయిగా. అది తాగితే ఓపిగ్గా, చురుగ్గా చదువుకుంటామని తెచ్చుకుంటారు" అన్నాడు మా పెద్దవాడు టీ.వి. ఎడ్వర్టయిజ్‌మెంట్‌లు చూసీ చూసీ ఆ సారం వంటబట్టడంతో.

"నాన్నగారికి ఈమధ్య మరీ నీరసంగా ఉంటోందర్రా. చ్యవనప్రాశ స్పెషల్ తెచ్చుకోమని ఎన్నాళ్ళనుంచో చెప్తున్నాను. అది తెచ్చుకుని ఉంటారు" అంది మా శ్రీమతి. నేను ఆఫీసుకీ. పిల్లలు స్కూల్స్, కాలేజీలకి వెళ్ళాక ఇంక ఆవిడకి కాలక్షేపం రేడియోనాయె. అందులో విన్న అడ్వర్టయిజ్‌మెంట్‌ల ప్రభావం ఆమాత్రం ఉండకుండా ఉంటుందా?

"నిన్న డిస్పెన్సరీకి వెళ్ళి రావాలన్నారు నాన్నగారు. బహుశా ఈరోజు వెళ్ళి ఉంటారు. వాళ్ళేదో టానిక్ ఇచ్చి ఉంటారు" అంది మా పెద్దమ్మాయి చెల్లాయితో వినీ వినిపించనట్లుగా.

వాళ్ళందర్నీ కాసేపు ఆటపట్టించాలన్న ఉద్దేశంతో నేను ఆ సీసా లేబుల్ కనబడకుండా నావైపు పెట్టుకుని "ఇదిగో దీని ఆకారం చూసి చెప్పండర్రా. ఇదేమయ్యుంటుంది" అన్నాను.

"జామ్"

"బూస్ట్"

"చ్యవనప్రాసే కదండీ?"

అమ్మాయిలేమీ మాట్లాడలేదు.

"ఇదేదీ కాదు. మీరందరూ పప్పులో కాలేశారు" అన్నాను.

"నేను కాదు" అంది మా పెద్దమ్మాయి.

"ఆ.... నువ్వు చెల్లాయి చెవిలో చెప్పిన మాటలు విన్నాలే" అన్నా.

"అయితే నేను కాదు. నేనసలు నోరు మెదపలేదు" అంది మా చిన్నమ్మాయి.

"అవునమ్మా..... నువ్వు నిండుకుండవి" అని "ఆ..... ఇదుగో చూడండర్రా ఈరోజు మనింట్లో విందు" అంటూ లేబుల్ కనిపించేటట్లు సీసా తిప్పాను.

"ఏమిటి! పచ్చడి సీసానా?" అన్నాడు మా వాడు నోరు వెళ్ళబెట్టూ.

"పచ్చడి కొనుక్కురావడమేమిటండీ. ఇంట్లో ఉన్న ఊరగాయలే తినలేక పోతున్నాం. అవన్నీ బూజు కట్టేస్తున్నాయి కూడాను. మొన్నకూడా నిమ్మకాయ బూజు కట్టే జాడీ ఎండలో పెట్టాను. చూడలా? మళ్ళీ ఇదెందుకండీ. మీకు డబ్బు ఎక్కువైనట్టుంది" అంటూ ఉపన్యాసం వరదలా వదిలింది నా శ్రీమతి.

"ఎవరు తింటారని నాన్నగారూ ఇది తేవడం? ఇంతకన్నా ఏ కలాఖానో తెస్తే అందరం తినేవాళ్ళంగా?" అంది మా పెద్దమ్మాయి.

"అందరూ తినాలనే తెచ్చాను. తెల్లవారి లేస్తే దీన్ని గురించిన ఎడ్వర్టయిజ్‌మెంట్‌లు పేపర్లో చూడ్డంలా! రేడియోలో వినడంలా? ఓసారి తెచ్చి చూస్తే ఆ రుచేమిటో మనకీ తెలుస్తుంది. బాగుందనుకుంటే మనమూ ఆవిధంగా చేసుకోవచ్చు" అన్నాను నేను.

"అంతేలెండి. మీ మగవాళ్ళ వ్యవహారాలు ఇలాగే ఉంటాయి. ఇంతకీ ఎంత చిలుము

వదిలిందేమిటి?'' అంది మా ఆవిడ.

"ఆ .... పదిహేడు రూపాయలే" అన్నా తేల్చిపారేస్తూ.

"పదిహేడు రూపాయలు" అని ఒత్తిపలికి "హుఁ ..... ఆ డబ్బుతో మనం ఇంట్లో పెట్టుకుని ఉండే పెద్దజాడీలో సగం ఊరగాయ వచ్చి ఉండేది ..... సరే కానీండి. ఇటువంటివి తెచ్చేటప్పుడు కాస్తంత ముందు చెప్తే ఈ రభసంతా ఉండకపోను" అంది.

"ముందు చెప్తే తేనిస్తారా?'' అని మనసులోనే అనుకుని "రుచి చూసి ఆ తర్వాత కామెంట్ చేయండి. ఎలాగూ భోజనం టైమైంది. తొందరగా వడ్డించండి. అందరికీ ఊరగాయ వెయ్యి' ' అంటూ ఆ సీసాని మా ఆవిడ చేతికి అందించాను.

చచ్చిన ఎలకను పట్టుకున్నంత బాధగా ఆ సీసాను పట్టుకుని అయిష్టంగా లోపలికి తీసుకు వెళ్ళింది మా ఆవిడ.

అమ్మాయిలు పీటలూ కంచాలూ పెట్టడానికి అమ్మ వెనకాలే లోపలికి వెళ్ళారు.

అబ్బాయిలిద్దరూ ఒకరి ముఖం ఒకరు చూసుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఉండిపోయారు.

నేను కాళ్ళు కడుక్కుని బట్టలు మార్చుకోటానికి వెళ్ళాను.

★ ★ ★

అందరం భోజనాల దగ్గర కూర్చున్నాం.

"నాన్నగారికి ఆ ఊరగాయ కొంచెం వెయ్యవే" అని మా పెద్దమ్మాయికి పురమాయించింది మా శ్రీమతి.

"నువ్వు కూడా కొంచెం వేయించుకో" అన్నాను.

"అబ్బో! నాకొద్దు. నేనెప్పుడైనా బజారు ఊరగాయలు తిన్నానా? తలుచుకొంటేనే నాకు ఒళ్ళు జలదరిస్తుంది" అంటూ ఒళ్ళు వంకర్లు పోనిచ్చింది.

బజారునుంచి తెచ్చే మిఠాయిలు తినడానికి మా ఆవిడకేమీ అభ్యంతరం, జలదరింపు ఉండవు. ఎటొచ్చీ ఊరగాయకే వచ్చింది.

"మీరేసుకోండే" అన్నా అమ్మాయిల వంక చూస్తూ.

"అమ్మో ... నాకొద్దు" అంది మా పెద్దమ్మాయి. ఆకు పురుగుని చూసినట్లు. అది ముమ్మూర్తుల వాళ్ళమ్మ పిల్ల.

"నాక్కొంచెం వెయ్యవే అక్కయ్యా" అంది చిన్నమ్మాయి.

ఎలాగూ తప్పనిదాన్ని గౌరవంగా ఒప్పుకుంటే బాగుంటుందన్నట్లు.

"మీరు రుచిచూసి చెప్పండ్రా" అన్నా అబ్బాయిలతో, వాళ్లు ఎలాగూ కాదరన్న నమ్మకంతో.

వాళ్ళేమీ మాట్లాడలేదు.

మా పెద్దమ్మాయి సీసా మూత తీసి, నాకు చెల్లాయికీ, తమ్ముళ్ళకి కొంచెం కొంచెం వడ్డించింది.

"తొందరగా మూత పెట్టవే. ఆ వాసనకి నాకు కడుపులో తిప్పుతోంది" అంది శ్రీమతి ముక్కు మూసుకుంటూ వెల్లుల్లిని చూసిన శ్రీవైష్ణవులలా?

మా అమ్మాయి సీసాకి మూత బిగించి ఏదో ఎంగిలో అంటో ముట్టుకున్నట్లు చేతులు కడుక్కుని వచ్చి కంచం దగ్గర కూర్చుంది.

మా రెండో అమ్మాయి ఊరగాయని కొద్దిగా నాలిక్కి రాసుకుని ఆముదం తాగినట్లు ముఖం

పెట్టింది.

"బాగాలేదు నాన్నగారూ, ఏమిటో మసాలా వాసనగా ఉంది. రుచి కూడా ఏమిటోగా ఉంది' ' అంటూ ఆ కాస్త ఊరగాయనీ పక్కకి తోసేసింది.

"వగలుపోకు. కాస్త నాలిక్కి రాసుకుంటే రుచి తెలిసిందా ఏమిటి? ఓ ముద్దు కలుపుకుని చూడు" అన్నాను.

"లేదండీ. అసలు నాకా వాసనే గిట్టడం లేదు. తింటే డోకు వచ్చేస్తుంది" అంది.

ఇంక నేను బలవంతం చేయలేదు.

మా మూడో అమ్మాయి దానికి వంత పాడింది.

మా పుత్రరత్నాలు ఏం చేస్తున్నారోనని వాళ్ళవైపు చూవాను. బుద్ధిమంతుల్లా ఇద్దరూ కొంచెంగా అన్నంతో కలుపుకుని ముద్దలు నోట్లో పెట్టుకుంటున్నారు. ఎంతైనా బయటతిండికి అంతో ఇంతో అలవాటుపడ్డ మగరాయుళ్ళాయె. వాళ్ళకి ఆడపిల్లలకున్నంత భేషజాలెందుకుంటాయి. ముద్దలు చప్పరిస్తూ వాళ్ళు 'పర్వాలేదు కాని ప్రత్యేకించి కొనుక్కోవలసినంత రుచిగా ఏం లేదు నాన్నగారూ' ' అన్నారు.

నేను తలకాస్త అటు తిప్పుకునేసరికి కలిసిన అన్నాన్నీ మిగిలిన పచ్చడినీ గుట్టుగా కంచం క్రిందికి తోసేశారు.

నేను అది చూసినా గమనించనట్లే ఊరుకున్నాను.

ఇంక నావంతు వచ్చింది. అందరూ నావంకే చూస్తున్నారు.

ఆ ఊరగాయ తినాలని నోరూరిన సంఘటనలను, సందర్భాలను గుర్తుతెచ్చుకుంటూ కొంచెం ఊరగాయ తీసి నాలిక్కి రాసుకున్నాను. నాకు తెలియకుండానే నా ముఖకవళికలు మారిపోసాగాయి. వస్తున్న నవ్వును ఆపుకుంటూ ముఖం ప్రక్కకి తిప్పుకుంది మా ఆవిడ. అగ్నిహోత్రావధానులింట్లో కరకటకశాస్త్రి లాగా.

మా అమ్మాయిలు నవ్వెక్కడ కనిపిస్తుందోనని తలలు దించేసి క్రీగంట చూడసాగారు.

మగపిల్లలవైపు తిరిగి చూసై ధైర్యం నాకు చాలలేదు. బింకానికి పోయి "ఊరగాయ పర్వాలేదనుకో. కాని మసాలా కొంచెం ఎక్కువగా దట్టించాడు" అంటూ కొద్దిగా అన్నంలో కలుపుకున్నాను. ఆ ముద్ద నోట్లో పెట్టుకున్నాను. కాని అది గొంతు దిగందే!

అసలు సంగతేమిటంటే ఆ ఊరగాయలో మసాలా మాట అటుంచి అల్లం దట్టించివేశాడు. మసాలా వాసన మా ఇంట్లో ఎవరికీ గిట్టదు. నేను మసాలానైనా తినగలను కాని అల్లం మాత్రం ముట్టుకోను. అది నాలిక్కి తలిగిందంటే డోకొచ్చినంత పనవుతుంది. అందుకే మా ఇంట్లో కూరలు చేసినప్పుడు అల్లం లేకుండా నాకు విడిగా తీసి ఆ తర్వాత అల్లం వేస్తారు. అటువంటిది దానినిండా అల్లం ఉండడంతో నేను ఒక్క ముద్ద కూడా మింగలేక ప్రక్కకి తోసాశాను" అల్లం వేయకుండా ఉంటే బాగుండేది" అంటూ.

అంతే. ఇంకా మావాళ్ళ నవ్వులు కట్టలు తెంచుకున్నాయి. కన్నీళ్ళు వచ్చేదాకా పడీపడీ నవ్వసాగారు.

ఏడవలేక నేనూ నవ్వుతూ "ఏమిటా నవ్వు?" అని కోప్పడ్డాను. ఈ విధంగా అప్పటికి ముగిసింది ఊరగాయ పర్వం.

పది రోజులైనా, పదిహేను రోజులైనా ఆ ఊరగాయని ముట్టుకున్నవాళ్ళు లేరు.

ఆ రోజు ఆదివారం.

తీరిగ్గా కూచుని పొద్దున్నే పేపరు చదువుకుంటున్నాను.

"కాస్తంత పచ్చడి ముద్ద వేయండమ్మా" అంటూ ఇంటిముందు నిలబడి అరిచాడో అన్నార్తుడు. వెంటనే నాకో బ్రెయిన్‌వేవ్ కలిగింది.

'ఎలాగూ మేము ఆ ఊరగాయని తినలేక పోతున్నాం. ఆ ముష్టివాడికిస్తే వాడు ఎంతో ఉబ్బి తబ్బిబ్బయి పోతాడు. అటువంటి ఖరీదైన ఊరగాయని అతగాడు ఎప్పుడైనా తిని ఉంటాడా?' ' అనుకుని వాడిని ఉండమన్నాను.

ముందు ఆ సీసా సీసా తీసికెళ్ళి వాడికి ఇయ్యాలనుకున్నాను. కాని అంతా ఒక్కడికే ఇచ్చేబదులు విష్ణుమూర్తి అమృతం పంచినట్లు పదిమంది ముష్టివారికి పదింతలు పంచితే పుణ్యం, పురుషార్థం కదా అనిపించింది. దొడ్లో వున్న ఓ బాదమాకు కోసుకువెళ్ళి అందులో కొంచెం ఎక్కువగానే ఆ ఊరగాయ పెట్టి తీసుకువెళ్ళాను.

ఊరగాయ తాజాగా ఉండడం, ఆకులో ఎక్కువగా కనిపించడంతో ఆ ముష్టివాడికి ఏమి అనుమానం వచ్చిందో "బాబూ ... నిజం చెప్పు. ఇందులో ఏ పురుగైనా పడిందా? ఇంత పచ్చడిస్తున్నావు?" అని సూటిగా అడిగాడు. వీడెవడో బ్రతికిచెడ్డ ముష్టాడు కాబోలు.

'ఓరి నిన్ను తగలెయ్యా పుణ్యానికి పోతే పులెత్తుకుపోయిందని, నీమీద జాలిపడితే నా శీలాన్నే శంకిస్తున్నావా?" అనుకుని "అదేం కాదోయ్, దీన్ని బజారునుంచి కొనుక్కొచ్చాం. ఇందులో మసాలా వేశారు. మేం ఎవ్వరం మసాలా తినం. అందువల్ల ఇచ్చేస్తున్నాను" అని ఉన్న నిజం చెప్పాను.

వాడు అనుమానంగా నావంక చూసి తప్పనిసరిగా దానిని తీసుకున్నాడు. ఏమనుకున్నాడో ఏమో దానిని మిగతావాటితో కలపకుండా జాగ్రత్తగా ఓ ప్రక్కన పెట్టాడు. ముందుకి సాగిపోతూ కూడా మధ్య మధ్య వెనక్కి తిరిగి నావంకే చూడడం మొదలుపెట్టాడు.

వాడి ప్రవర్తనకి నేను విస్తుపోయి అలాగే గేటు దగ్గరే నిల్చుండిపోయాను.

ముష్టివాడు నాలుగిళ్ళు దాటాడో లేదో ఎదురుగుండా "మాదాకోళమమ్మా" అంటూ మరో ముష్టివాడు వస్తున్నాడు. వెంటనే వీడు వాడిని ఆపి "ఇది తీసుకోరా. నాకు ఈరోజు బాగానే దొరొకిందిలే. ఇది నువ్వు తీసుకో'" అంటూ జాగ్రత్తగా నేనిచ్చిన పచ్చడిని ఆకుతో సహా వాడి జోలెలోకి వేశాడు.

ఆ దృశ్యం నాకు స్పష్టంగా కనిపించింది.

ఆదివారం ప్రొద్దున రోడ్‌మీద రద్దీ లేకుండడం. గాలివాలుగా ఉండడంతో వాడి మాటలు కూడా నాకు స్పష్టంగా వినబడ్డాయి.

ఆ రెండో ముష్టివాడు కూడా దానిని అనుమానం గానే తీసుకోవడం నేను స్పష్టంగా గమనించాను. ఒక ముష్టివాడు మరో ముష్టివాడికి ఊరకే కమ్మని తాజా ఊరగాయను వేస్తే నమ్మేటంతటి అమాయకుడా వాడు?

బహుశా వాడుకూడా దానిని ఇంకెవరికో ట్రాన్స్‌ఫర్ చేస్తాడు. లేదా అవతల పారేస్తాడు అనుకుంటూ ఇంట్లోకి వచ్చి మా ఆవిడకి సంగతి చెప్పాను.

"కొత్త ఊరగాయను ఊరికే పోతుందని సద్బుద్ధితో చేస్తే ఎలా అయిందో చూడు. మిగతా ముష్టివాళ్ళూ ఇంతే చేస్తారు? పోనీ ఏ స్నేహితులకేనా ఇస్తే వాళ్ళేమనుకుంటారో?" అన్నాను.

"మీరు అంత ఎక్కువగా పచ్చడి పట్టుకెళ్ళారు కాబట్టి అది కూడా అన్నం లేకుండా కావడంతో

వాడికి అనుమానం వచ్చింది. ఈసారి నుండి మిగిలిపోయిన అన్నంతోపాటు కొద్దికొద్దిగా ఈ ఊరగాయ వేద్దాం. ఎవ్వరికీ అనుమానం రాదు. చెడకుండానే మొత్తం ఖర్చయిపోతుంది" అంటూ నాకు జ్ఞానోపదేశం చేసింది మా ఆవిడ.

ఆవిడ ఉపదేశం ఊరగాయ కొనేముందు తీసుకునుంటే ఈ ఖర్చు, ఈ హైరానా తప్పేవికదా అనుకుంటూ ఉసూరుమన్నాను. పైకి మాత్రం "అందుకేనోయ్. కరణేషు మంత్రీ అన్నారు" అన్నాను మెచ్చుకుంటూ.

"ఆ .... ఆ..... మా మంత్రిత్వం అంతా అయ్యాకేగా!" అంటూ వంట పనిలోకి వెళ్ళిపోయింది శ్రీమతి.

గట్టుమీదున్న ఆ ఊరగాయ సీసా నన్ను చూసి నవ్వుతున్నట్లనిపించింది.

*(స్వాతి సపరివార పత్రిక, 20-7-90)*
*(ప్రత్యేక బహుమతి పొందిన కథ)*